క్లుప్తంగా

సత్యసాయి ట్రస్టు సేవలు అభినందనీయం



ఆర్‌జే రత్నాకర్‌ను సన్మానిస్తున్న వైద్యులు

పుట్టపర్తి టౌన్/ప్రశాంతి నిలయం: శ్రీసత్యసాయి ట్రస్టు సేవలు అభినందనీయమని డాక్టర్ల బృందం కొనియాడింది. కర్నూలు మెడికల్ కళాశాల 1969వ బ్యాచ్‌కు చెందిన 50 మంది వైద్యులు శనివారం సత్యసాయి బాబా మహాసమాధిని దర్శించారు. అనంతరం సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ సభ్యుడు ఆర్‌జే రత్నాకర్, సభ్యులను వైద్యులు కలసి సత్కరించారు. డాక్టర్ ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ సత్యసాయి వైద్య రంగంలో మానవాళికి అందించిన సేవలు అమోఘమన్నారు. ఆయన సేవలను కొనసాగిస్తూ సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 40 లక్షల మంది విద్యార్థులకు జగనన్న గోరుముద్ద కార్యక్రమంలో రాగిజావ అందించేందుకు ముందుకు రావడం గొప్పవిషయమన్నారు. వైద్యులు సుబ్బయ్య, విజయలక్ష్మి, కబీర్ పాల్గొన్నారు.

కల్యాణోత్సవానికి విరాళం



విరాళాన్ని అందజేస్తున్న దృశ్యం

కదిరి అర్బన్: గంగన్నగారిపల్లిలోని రాముల గుడిలో సీతారాముల కల్యాణోత్సవం నిర్వహణకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బత్తల హరిప్రసాద్ రూ.50 వేల విరాళాన్ని ప్రకటించారు. ఈ మొత్తాన్ని మాజీ సర్పంచ్ బత్తల వెంకటరమణ ఆలయ కమిటీ సభ్యులకు శనివారం అందజేశారు.

టీకాతో గాలికుంటుకు అడ్డుకట్ట

బత్తలపల్లి: పశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండా టీకాలు వేయించాలని బత్తలపల్లి పశు వైద్యాధికారి గుర్నాథరెడ్డి పేర్కొన్నారు. ఈదుల ముష్టూరు, ముద్దనపల్లి గ్రామాల్లో పశువులకు శనివారం ఆయన టీకా వేశారు. గాలికుంటుతో పాడి పశువుల్లో పాల ఉత్పత్తి తగ్గుతుందన్నారు.

రాయితీతో పశుగ్రాస విత్తనాలు

బత్తలపల్లి: వేసవిలో పశుగ్రాసం విత్తనాలను 75శాతం రాయితీతో పంపిణీ చేస్తున్నట్లు పశు వైద్యాధికారి గుర్నాథరెడ్డి పేర్కొన్నారు. రాయితీపోను ఐదు కేజీల ప్యాకెట్ రూ.115తో అందిస్తామని, బోరు బావులు ఉన్న రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

గృహ నిర్మాణాల పరిశీలన

అమడగూరు: గృహ నిర్మాణ పనులు పూర్తయిన వెంటనే బిల్లులు చెల్లిస్తున్నట్లు హౌసింగ్ డీఈ నాగరాజు పేర్కొన్నారు. తుమ్మల, కొత్తపేట, మలకవారిపల్లి, ఎగువ, దిగువ తండా, వెంకటనారాయణపల్లి గ్రామాల్లో నిర్మిస్తున్న జగనన్న ఇళ్లను పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడుతూ ప్రతి ఇంటికీ మూడు దశల్లోనే మొత్తం బిల్లులు అందుతాయన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

ఎన్పీకుంట: టీఎస్‌పల్లికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు జల్లా మల్లారెడ్డి, సల్లా నారాయణరెడ్డిని ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి శనివారం పరామర్శించారు. జల్లా మాల్లారెడ్డి వెన్నెముక సమస్యతో బాధపడుతూ చికిత్స చేయించుకొని ఇంటికి వచ్చారు. సల్లా నారాయణరెడ్డి రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స చేయించుకొని నాలుగు నెలలుగా మంచానికే పరిమితం అయ్యాడు. ఎమ్మెల్యే వీరిని కలిసి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు.

సెబ్ సీఐ బాధ్యతల స్వీకరణ

పుట్టపర్తి అర్బన్: ధర్మవరం సెబ్ సీఐగా నియమితులైన ఎస్.లక్ష్మీదుర్గయ్య శనివారం జిల్లా సెబ్ అధికారి రామకృష్ణప్రసాద్‌కు ఆర్డర్ కాపీని అందజేసి బాధ్యతలు స్వీకరించారు.

వేరుశనగ వామికి నిప్పు



మంటల్లో కాలిపోతున్న వేరుశనగ వాము

కనగానపల్లి: మద్దెలచెరువులో వేరుశనగ వాముకు గుర్తు దుండగులు శనివారం రాత్రి నిప్పుపెట్టారు. 10 ట్రాక్టర్ల వేరుశనగ కట్టె కాలిపోయి రూ.5 లక్షల నష్టం జరిగింది. రైతు మల్లాల రామాంజనేయులు రబీలో సాగు చేసిన వేరుశనగ పంటను నాలుగు రోజుల క్రితం తొలగించి పొలం వద్దే వాము వేశాడు. రాత్రి వేళలో దుండగులు నిప్పు పెట్టడంతో స్థానికులు మంటలు ఆర్పే ప్రయత్నం చేసినా ఫలితంలేకపోయింది. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు ఆర్పివేశారు.

సేంద్రియ పద్ధతుల్లో అధిక దిగుబడి

ఎన్పీకుంట: సేంద్రియ పద్ధతుల్లో పంటలు సాగు చేసి అధిక దిగుబడి సాధించవచ్చని మండల వ్యవసాయ అధికారి లోకేశ్వరరెడ్డి పేర్కొన్నారు. వెలిచలమల ఆర్బీకే పరిధిలో సాగైన వేరుశనగ పొలంలో శనివారం డాక్టర్ వైఎస్సార్ పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. నాణ్యమైన విత్తనాలు వాడాలని, రసాయన ఎరువులను తగ్గించాలని సూచించారు.

విద్యార్థికి మరింత బలం



ఓడీ చెరువు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులు

- ప్రభుత్వ పాఠశాలల్లో బ్రేక్ ఫాస్ట్‌గా రాగి జావ
- ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగిశాక అమల్లోకి
- పిల్లల సంపూర్ణ ఎదుగుదలకు బాటలు
- జగనన్న గోరుముద్దతో కమ్మని భోజనం
- ప్రభుత్వ పాఠశాలల్లో తగ్గుతున్న డ్రాపౌట్ల సంఖ్య

ఓడీ చెరువు: నేటి బాలలే రేపటి పౌరులు. ఈ నాటి వారి ఆరోగ్యమే రేపటి దేశానికి బలం. పిల్లలు ఆరోగ్యంగా ఉన్నప్పుడే చదువుల్లో, ఆటల్లో రాణిస్తారు. ఈ క్రమంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ప్రతి విద్యార్థికీ సంపూర్ణ పోషకాహారం అందించాలనే దృఢ సంకల్పంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇప్పటికే జగనన్న గోరుముద్ద పథకాన్ని ప్రవేశపెట్టారు. తాజాగా ఈ పథకానికి ప్రభుత్వం అదనపు పోషకాలను జత చేస్తోంది. విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్‌గా రాగి మాల్ట్ (రాగిజావ)ను వారానికి 3 రోజులు (మంగళ, గురు, శనివారం) అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. పుట్టపర్తి నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో 1వ తరగతి నుంచి 10 వ తరగతి వరకు 290 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. 21,241 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరందరికీ రాగి జావ పంపిణీ చేయనున్నారు.

ఎమ్మెల్సీ కోడ్‌తో పథకం అమలుకు తాత్కాలిక బ్రేక్

మార్చి 2 నుంచి విద్యార్థులకు రాగి జావ అందించాలని ప్రభుత్వం గతంలో ఆదేశాలు జారీ చేసింది. అయితే ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో కోడ్ అమలులోకి రావడంతో ఈ పథకం అమలును తాత్కాలికంగా వాయిదా వేశారు. కోడ్‌ముగిసిన వెంటనే విద్యార్థులకు రాగి జావ అందించనున్నారు.

గోరుముద్దలో పోషకాల లోడింగ్:

జగనన్న గోరుముద్ద పథకం కింద కమ్మని భోజనం అందిస్తుండటంతో ప్రభుత్వ పాఠశాలల్లో డ్రాపౌట్ల సంఖ్య తగ్గిందని అధికారులు చెబుతున్నారు. విద్యార్థుల అభిరుచులకు తగ్గట్టు ఇప్పటికే మూడుసార్లు మెనూలో మార్పులు చేశారు. దీనికి తోడు మధ్యాహ్న భోజనంలో కోడిగుడ్ల సంఖ్యను పెంచారు. అదనంగా వేరుశనగ చిక్కీలను కూడా అందిస్తున్నారు. తాజాగా రాగిజావ పిల్లల ఆరోగ్యానికి మరో బోనస్‌గా మారనుంది. రాగి జావతో విద్యార్థుల్లో ఐరన్, కాల్షియం లోపాలను అధిగమించే వీలుంది.

మండలం	పాఠశాలల సంఖ్య	1 నుంచి 10వ తరగతి విద్యార్థులు
ఓడీ చెరువు	78	4,061
బుక్కపట్నం	32	2,500
కొత్తచెరువు	42	3,100
పుట్టపర్తి	42	5,680
అమడగూరు	42	2,300
నల్లమాడ	54	3,600
మొత్తం	290	21,241



రాగి జావ

రాగి జావ అందించేందుకు చర్యలు



మధ్యాహ్న భోజన పథకంలో బ్రేక్‌ఫాస్ట్‌గా రాగి జావను అందించేందుకు ప్రభుత్వం కార్యాచరణ చేపట్టింది. త్వరలో దీన్ని అమలు చేసేందుకు కసరత్తు చేస్తున్నాం. రాగి జావ తయారీకి ప్రభుత్వమే నాణ్యమైన రాగిపిండి, బెల్లం సరఫరా చేస్తోంది. మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులే రాగిజావని తయారు చేసి విద్యార్థులకు అందిస్తారు.

-ఖాదర్ వలి బాషా, ఎంఈఓ, ఓడీ చెరువు

రాగి జావలో పోషకాలు పుష్కలం



ఆరోగ్యానికి అవసరమయ్యే తృణధాన్యాల్లో రాగులు ఒకటి. రాగి పిండిలో కాల్షియం ఎముకల దృఢత్వానికి ఎంతో ఉపయోగకరం. రాగిజావలో ఐరన్ కంటెంట్ ఎక్కువ. ఇవి విద్యార్థులకు శక్తినిస్తాయి. పిల్లల్లో ఎదుగుదలకు రాగి జావ ఉపయోగపడుతుంది. రక్తహీనతను నివారిస్తుంది. వేసవిలో రాగి జావ శరీరానికి చల్లదనాన్నిస్తుంది.

-డాక్టర్ ఐనుద్దీన్ ఖాన్, అడిషనల్ డీఎంఅండ్ హెచ్ఓ, ఓడీ చెరువు

ఓటరు స్లిప్పుల పంపిణీ

కనగానపల్లి: ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వినియోగించుకునే వారికి ఓటరు స్లిప్‌లు పంపిణీ చేస్తున్నట్లు తహసీల్దార్ పీవీ రమణ తెలిపారు. మండలంలో పట్టభద్రుల ఓటర్లు 1,030, ఉపాధ్యాయుల ఓటర్లు ఎమ్మెల్సీ 22 మంది ఉన్నట్లు ఆయన తెలిపారు. స్థానిక గ్రామాల్లోని బీఎల్‌ఓలు ఇంటింటికీ వెళ్లి ఓటరు స్లిప్పులు అందిస్తున్నట్లు ఆయన తెలిపారు.

డ్రిప్ పరికరాలు దగ్ధం

నల్లచెరువు: బాలేపల్లి తాండాలో అగ్నిప్రమాదం జరిగి లక్షల రూపాయల విలువైన డ్రిప్ పరికరాలు దగ్ధమయ్యాయి. తండాకు చెందిన కె.ఆంజనేయులు శుక్రవారం తన పొలంలో సర్వే కోసం కంపచెట్లకు నిప్పు పెట్టగా ఆదే గ్రామానికి చెందిన రమేష్ నాయక్ అనే రైతు పొలానికి మంటలు వ్యాపించాయి. డబ్బ చిక్కుడు పంట, బోర్ స్టార్టర్, వైర్లు, పైపులు, డ్రిప్ పరికరాలు కాలి బూడిదయ్యాయి. రూ.5 లక్షల మేర నష్టం వాటిల్లిందని, బాధ్యులపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని బాధిత రైతు నల్లచెరువు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

బాలసదన్‌ను తనిఖీ చేసిన జడ్జీలు



విద్యార్థులతో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి గీతావాణి, జూనియర్ సివిల్ జడ్జి రమ్యసాయి

ధర్మవరం: పట్టణంలోని బాలసదన్ హాస్టల్‌ను శనివారం సీనియర్ సివిల్ జడ్జి గీతావాణి, జూనియర్ సివిల్ జడ్జి రమ్యసాయి తనిఖీ చేశారు. హాస్టల్‌లోని గదులను పరిశీలించారు. భోజన నాణ్యతపై విద్యార్థులతో ఆరా తీశారు. ఏమైనా సమస్యలున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల ఆరోగ్యంపట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని వార్డెన్‌కు సూచించారు. అనంతరం బాలికల హక్కులు, వివిధ చట్టాలపై వివరించారు. ప్రతి బాలికా ఉన్నత విద్యను అభ్యసించి తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలని సూచించారు. న్యాయవాది బాలసుందరి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను ఆశీర్వదించండి

- ఓటర్లను కోరిన ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి
- ఎమ్మెల్సీ అభ్యర్థుల తరఫున ప్రచారం



పెడపల్లి ఉన్నత పాఠశాలలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

పుట్టపర్తి అర్బన్: పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి రామచంద్రారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. అభ్యర్థుల తరవున మండలంలోని పెడపల్లి ఉన్నత పాఠశాల, జగరాజుపల్లి ఉన్నత పాఠశాల, కేజీబీవీ, మోడల్‌స్కూల్, మంగళకర ఎడ్యుకేషన్ ట్రస్ట్‌లో శనివారం ఎమ్మెల్యే విస్తృత ప్రచారం నిర్వహించారు. విద్యావంతులైన వెన్నపూస రవీంద్రారెడ్డి, రామచంద్రారెడ్డిలకు వైఎస్సార్‌సీపీ టికెట్ ఇచ్చిందన్నారు. వారికి ఆశీస్సులు అందజేసి గెలిపించాలన్నారు. అనంతరం ఓటింగ్ విధానంపై ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. బ్యాలెట్ పేపర్‌లో అభ్యర్థుల పేర్ల పక్కన మొదటి ప్రాధాన్యత ఓటుగా ఒకటవ నంబర్ వేయాలని సూచించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి ఒకేసారి లక్షలాది ఉద్యోగాలను సృష్టించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. పాడెపై ఉన్న టీడీపీ రాబోయే కాలంలో పూర్తిగా కనుమరుగవుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఏవి రమణారెడ్డి, అగ్రిబోర్డు జిల్లా చైర్మన్ అవుటాల రమణారెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ ఈశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసారెడ్డి, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు తిరుపాల్‌నాయక్, వైఎస్సార్ టీఎఫ్ నాయకులు రమణారెడ్డి, సచివాలయ కన్వీనర్ మల్లికార్జున, మాజీ మండల కన్వీనర్ గంగాద్రి, శ్రీనివాస్‌నాయక్, మురళీధర్‌రెడ్డి, ఆనంద్‌నాయక్, మంగళకర ట్రస్ట్ కరస్పాండెంట్ సురేష్‌కుమార్, ఏఓ జయచంద్రారెడ్డి, హెచ్ఎం రామచంద్రారెడ్డి, రవినాయక్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థుల గెలుపే లక్ష్యం

- నాయకులకు దిశానిర్దేశం చేసిన ఎమ్మెల్యే సిద్దారెడ్డి



ఎమ్మెల్సీ ఎన్నికలపై పార్టీ శ్రేణులకు సూచనలు ఇస్తున్న ఎమ్మెల్యే పీవీ సిద్దారెడ్డి

ఎన్పీకుంట: ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా పార్టీశ్రేణులు శక్తి వంచన లేకుండా కృషి చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి పిలుపునిచ్చారు. వెలిచలమల, గౌకనపేట, టీఎస్ పల్లి, మరికొమ్మదిన్నె, ఎన్.పీ.కుంట పంచాయితీల సర్పంచులు, ఎంపీటీసీలు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో శనివారం ఆయా పంచాయతీలలో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ శ్రేణులు ఈ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి, టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి రామచంద్రారెడ్డికి మద్దతుగా విస్తృతంగా ప్రచారం నిర్వహించి అత్యధిక మెజారిటీతో గెలిపించుకోవాలని కోరారు. అనంతరం ఓటరు లిస్టును నాయకులకు అందజేశారు. ఓటు వేసే విధానాన్ని వివరించారు. ఎంపీపీ ఈటెరాము, ఎంపీటీసీలు కొత్తరంగారెడ్డి, తిమ్మారెడ్డి, జేపీఎస్ మండల ఇన్‌చార్జ్ ఆదినారాయణరెడ్డి, కోఆప్షన్ సభ్యుడు సుబహాన్, సర్పంచులు ఆంజినమ్మ, రామాంజులరెడ్డి, వెంకటేశు, రిటైర్డ్ ప్రిన్సిపాల్ రామచంద్రారెడ్డి, యూత్ కన్వీనర్ వేణుగోపాల్‌యాదవ్, నాయకులు షామీర్ బాషా, ఈశ్వర్‌నాయక్, గోవిందునాయక్, తిరుమలనాయుడు, వెంకటరామిరెడ్డి, అల్లాభక్షు, వాటర్‌షెడ్ చైర్మన్లు బయారెడ్డి, ఓబులరెడ్డి, మాజీ ఎంపీపీ సోమిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక గదుల నిర్మాణానికి కొలతల సేకరణ

నల్లచెరువు: మండల పరిధిలోని శ్రీ పాలపాటి దిన్నె ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో నూతన గదుల నిర్మాణానికి దేవదాయశాఖ ఏఈ హరిత శనివారం కొలతలు తీసుకున్నారు. అంతకుముందు ఆంజనేయ స్వామిని దర్శించుకున్నారు. ఆలయ ఈఓ సి.రామాంజనేయులు, దేవాలయ చైర్మన్ దేవరింటి భాస్కర్‌రెడ్డి ఏఈని సత్కరించి స్వామి వారి చిత్రపటాన్ని అందజేశారు.

విశ్రాంత హెచ్ఎం దస్తగిరి మృతి



దస్తగిరి (ఫైల్)

పుట్టపర్తి టౌన్: పుట్టపర్తి మున్సిపాలిటీ బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు దస్తగిరి అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. పుట్టపర్తి, చుట్టుపక్కల గ్రామాల్లో ఉపాధ్యాయుడిగా పనిచేసి ప్రధానోపాధ్యాయుడిగా పదోన్నతి పొందారు. వేలాది మంది విద్యార్థులను తీర్చిదిద్దారు. ఉద్యోగ విరమణ తర్వాత బాబా లర్నింగ్ పేరుతో పాఠశాల ఏర్పాటు చేశారు. ఆయన మృతికి పలువురు పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు సంతాపం ప్రకటించారు.

'సూపర్'లో అరుదైన 'శస్త్రచికిత్స'



నారాయణమ్మతో వైద్య బృందం

అనంతపురం సప్తగిరి సర్కిల్: మెట్రో నగరాలకే పరిమితమైన అరుదైన శస్త్రచికిత్సను అనంతపురంలోని ప్రభుత్వ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి వైద్యులు చేసి రికార్డు సృష్టించారు. 59 ఏళ్ల వృద్ధురాలికి నూతన జీవితాన్ని అందించారు. వివరాలు... ఆయాసం, శ్వాసకోశ వ్యాధితో ఇబ్బంది పడుతున్న శ్రీసత్యసాయి జిల్లా బుక్కపట్నం మండలం మారాళ్ల గ్రామానికి చెందిన నారాయణమ్మను అనంతపురం సర్వజనాస్పత్రికి తీసుకువచ్చారు. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో అడ్మిషన్ కల్పించి, డాక్టర్ సుభాష్ చంద్రబోస్ నేతృత్వంలో పలు రకాల వైద్య పరీక్షలు చేసిన తర్వాత ప్రధాన రక్తనాళంలో రక్తం గడ్డ కట్టినట్లు గుర్తించి, సూది మందుతో కరిగించేందుకు ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో ఆమెలో ప్లేటులెట్ల సంఖ్య పూర్తిగా తగ్గిపోయాయి. క్యాథటర్ డైరెక్టెడ్ థ్రాంబోలైసిస్ అనే వినూత్న శస్త్రచికిత్స ద్వారా రక్తనాళంలో ఉన్న గడ్డను కరిగించారు. సాధారణంగా ఇలాంటి శస్త్రచికిత్సలు బెంగుళూరు, హైదరాబాద్ వంటి నగరాల్లో మాత్రమే చేస్తారు. ఇందుకు రూ. 4 లక్షల వరకు ఫీజులు వసూలు చేస్తారు. ఇంతటి ఖరీదైన శస్త్రచికిత్సను వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం కింద ఉచితంగా అందజేశారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉంది. సమావేశంలో సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రఘునందన్, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్రహ్మణ్యం, కార్డియాలజిస్ట్ డాక్టర్ సుభాష్ చంద్రబోస్, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీదేవి, ఆర్ఎంఓ వైవీ రావు, వైద్యులు సౌజన్య కుమార్, వెంకటరమణ, రాజశేఖర్ స్వరూప్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీలకు పెద్దపీట



ఓట్లు అభ్యర్థిస్తున్న కోటి సూర్యప్రకాష్‌బాబు, కోటి సుధ

బత్తలపల్లి: శాసనమండలి ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీ, ఎస్సీ, ఎస్టీలకు పెద్దపీట వేశారని ఏపీ కురుబ కార్పొరేషన్ చైర్మన్ కోటి సూర్యప్రకాష్‌బాబు, ఎంపీపీ గజ్జెల వెంగళరెడ్డి, జెడ్పీటీసీ కోటి సుధ అన్నారు. బత్తలపల్లిలో కోటి సూర్యప్రకాష్‌బాబు స్వగృహంలో శనివారం వలంటీర్లు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి విజయానికి శ్రమించాలన్నారు. బగ్గిరి బయపరెడ్డి, జయరామిరెడ్డి, ఈడిగ కాశప్ప పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలపై అవగాహన

కదిరి అర్బన్: ఎమ్మెల్సీ ఎన్నికలపై స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ రాఘవేంద్ర శనివారం రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఓటింగ్ విధానంపై అవగాహన కల్పించారు. పోలింగ్ బూత్‌ల ఏర్పాటు, ఎన్నికలు సజావుగా జరిపేందుకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. డిప్యూటీ తహసీల్దార్ సునీత పలు రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఇరు వర్గాల ఘర్షణ

తనకల్లు: రాకుంటపల్లిలో నూతనంగా నిర్మిస్తున్న గంగమ్మ ఆలయానికి సంబంధించి కాంపౌడ్ స్థలం విషయంపై శనివారం ఇరువర్గాలవారు ఘర్షణ పడ్డారు. ఘర్షణలో ఒకరికి గాయాలయ్యాయి. అనంతరం ఇరువర్గాల వారూ పరస్పరం పోలీసులకు ఫిర్యాదు చేశారని ఎస్‌ఐ రాంభూపాల్ తెలిపారు.

ఆదిలాబాద్ నుంచి 'పర్తి'యాత్ర

ప్రశాంతి నిలయం: తెలంగాణ రాష్ట్రంలోని పలు జిల్లాలకు చెందిన సత్యసాయి భక్తులు పర్తియాత్ర పేరుతో శనివారం పుట్టపర్తి చేరుకున్నారు. ఆదిలాబాద్, కొమురం భీం, మంచిర్యాల, అసిఫాబాద్ జిల్లాలకు చెందిన 2,500 మంది భక్తులు పుట్టపర్తికి తరలివచ్చారు. మూడు రోజుల పాటు వారు పుట్టపర్తి ప్రశాంతి నిలయంలో పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక, సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. భక్తులతో ప్రశాంతి నిలయంలో సందడి నెలకొనింది.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు..

పర్తియాత్రలో భాగంగా పుట్టపర్తికి చేరుకున్న తెలంగాణ సత్యసాయి భక్తులు సాయికుల్వంత్ సభా మందిరంలో సత్యసాయి మహాసమాధి చెంత సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కలియుగంలో తరుణోపాయం పేరుతో నృత్య కచేరీ నిర్వహించారు. ఆధ్యాత్మిక సందేశాన్నిస్తూ చిన్నారులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమం భక్తులను అలరించింది. అంతకుమునుపు ఆదిలాబాద్ జిల్లా సత్యసాయి సేవా సంస్థల అధ్యక్షుడు శ్రీనివాసరావు జిల్లాలో జరుగుతున్న సత్యసాయి సేవలను వివరించారు.

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వరరావ్

కదిరి అర్బన్: విద్యార్థి దశలోనే చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వరరావ్ సూచించారు. మున్సిపల్ పరిధిలోని గట్ల వద్ద ఉన్న కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సులో జడ్జి పాల్గొని విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. భోజనం, ఇతర సదుపాయాలపై ప్రిన్సిపాల్ నాగలక్ష్మిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు లింగాల లోకేశ్వరరెడ్డి, సీనియర్ న్యాయవాది నరసింహులు, షాబుద్దీన్ పాల్గొన్నారు.

నేడు గృహ సారథులతో సమావేశం

తనకల్లు: గృహ సారథులు, గ్రామ సచివాలయ కన్వీనర్లతో స్థానిక పీవీకే ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం ఉదయం 9గంటలకు సమావేశం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మధుసూదన్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేస్తారన్నారు.

ప్రారంభమైన ఉరుసు

ఓడీ చెరువు: మండల పరిధిలోని అచ్చామియాపల్లిలో కొలువైన అచ్చామియాస్వామి 430వ ఉరుసు మహోత్సవం శనివారం పీఠాధిపతి హజరత్ ఖ్వాజా సయ్యద్‌షా ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభమైంది. కొండకమర్ల నుంచి వైఎస్సార్‌సీపీ నాయకుడు, మండల కోఆప్షన్ సభ్యుడు నిషార్ అహమ్మద్ ఇంటి నుంచి గంధాన్ని మల్లెల గంపలో మంగళ వాయిద్యాల మధ్య తీసుకెళ్లి స్వామివారికి సమర్పించారు.

బిగ్‌హెల్ప్ ద్వారా పుస్తకాల పంపిణీ

పుట్టపర్తి అర్బన్: హైదరాబాద్‌కు చెందిన బిగ్‌హెల్ప్ స్వచ్ఛంద సంస్థ అందించిన పుస్తకాలను ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి శనివారం పెడపల్లి, నిడిమామిడి పాఠశాలల విద్యార్థులు 50 మందికి అందజేశారు. కోఆర్డినేటర్ చెన్నక్రిష్టారెడ్డి, ఎంపీపీ ఏవి రమణారెడ్డి, హెచ్ఎం రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

గ్యాస్ ధర తగ్గించాలి

ముదిగుబ్బ: కేంద్ర ప్రభుత్వం పెంచిన వంట గ్యాస్ ధరలను తగ్గించాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు తహసీల్దార్ కార్యాలయం వద్ద నాయకులు శనివారం ధర్నా నిర్వహించారు. నాయకులు లక్ష్మినారాయణ, తిప్పయ్య మాట్లాడుతూ దేశంలో పేదరికం పెరిగేందుకు కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలే కారణమన్నారు.

ఐసీడీఎస్ కొత్త ప్రాజెక్టుగా బత్తలపల్లి

బత్తలపల్లి: ఐసీడీఎస్ ప్రాజెక్టుల విస్తరణలో భాగంగా కొత్త ప్రాజెక్టుగా బత్తలపల్లిని ఏర్పాటు చేసినట్లు సీడీపీఓ సరస్వతి తెలిపారు. మండల కేంద్రంలోని తాడిపత్రి రోడ్డులో ఉన్న భారతీ మండల సమాఖ్య పాత కార్యాలయంపై తాత్కాలిక ప్రాజెక్టు ఆఫీసు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. బత్తలపల్లి ప్రాజెక్టు కింద బత్తలపల్లి, తాడిమర్రి, ముదిగుబ్బ మండలాలు ఉంటాయన్నారు.

సైకిల్ ర్యాలీ విజయవంతం చేయండి

ప్రశాంతి నిలయం: ప్రపంచ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న సైకిల్ ర్యాలీని విజయవంతం చేయాలని డీఎంహెచ్ఓ వెంకటకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ ఆదివారం ఉదయం 8 గంటలకు ఎనుములపల్లి గణేష్ సర్కిల్ వద్ద కలెక్టర్ బసంత్ కుమార్ సైకిల్ ర్యాలీని ప్రారంభిస్తారన్నారు. 'ఆరోగ్యకర మహిళ–ఆరోగ్యకర భారత్' అన్న నినాదంతో ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహిళల్లో మానసిక, శారీరక ఆరోగ్యాన్ని పెంచడంతో పాటు వాతావరణ కాలుష్య రహితంగా మార్చడం కార్యక్రమ ముఖ్య ఉద్దేశమన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్ర మహిళా సిబ్బంది, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ సిబ్బంది, విద్యార్థినులు, మహిళలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల తరఫున జోరుగా ప్రచారం



తాడిమర్రి: మరవపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న ఎంపీపీ భువనేశ్వర్ రెడ్డి

తాడిమర్రి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ రాష్ట్రాభివృద్ధికి చేస్తున్న కృషిని గుర్తించి ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత ఓట్లు వేయాలని గ్రాడ్యుయేట్ ఓటర్లకు ఎంపీపీ పాటిల్ భువనేశ్వర్‌రెడ్డి కోరారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రా రెడ్డి విజయం కోసం శనివారం ఆయన మరువపల్లి, ఎం.అగ్రహారం గ్రామాల్లో పట్టభద్రులను కలిసి ఓట్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు విజయ భాస్కర్‌రెడ్డి, సచివాలయ కన్వీనర్ సాయినాథ్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ రామాంజనేయులు, సర్పంచు పుల్లయ్య, సీనియర్ నాయకులు సన్నప్పయ్య, రాజేంద్ర ప్రసాద్, హరి పాల్గొన్నారు.

పుట్టపర్తి టౌన్: వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులు వెన్నపూస రవీంద్రారెడ్డి, రామచంద్రారెడ్డి తరఫున మున్సిపల్ చైర్మన్ తుంగ ఓబుళపతి, వైఎస్సార్ సీపీ నాయకులు శనివారం పట్టపర్తి పట్టణంలో అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ పాఠశాలల్లో సిబ్బందిని, పట్టభద్రులను కలిసి ఓట్లను అభ్యర్థించారు. నెడ్‌క్యాప్ డైరెక్టర్ మాధవరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ తిప్పన్న, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ రంగారెడ్డి, మెప్మా అధ్యక్షురాలు సాయిలీల, కౌన్సిలర్లు చెరువుభాస్కర్‌రెడ్డి, సాయిగీత, సూర్యాగౌడ్, మాజీ కౌన్సిలర్ నారాయణరెడ్డి, మాజీ మండల కన్వీనర్ గంగాద్రి పాల్గొన్నారు.

ముదిగుబ్బ: వెన్నపూస రవీంద్రారెడ్డి తరఫున వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ ఇందుకూరి నారాయణరెడ్డి శనివారం ముదిగుబ్బలో పట్టభద్రులను కలిసి ప్రచారం నిర్వహించారు. భాస్కర్, చంద్రాయుడు, క్రిష్టారెడ్డి, శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

కొత్తచెరువు: వెన్నపూస రవీంద్రారెడ్డి విజయంకోసం వైఎస్సార్‌సీపీ సీఈసీ సభ్యుడు కొత్తకోట సోమశేఖర్ రెడ్డి, చక్రధర్ రెడ్డి, మాజీ సర్పంచ్ లోచర్ల రాజారెడ్డి శనివారం కొత్తచెరువు, బండ్లపల్లి, తలమర్ల, చెన్నరాజుపల్లి, జిల్లపరిషత్ పాఠశాలల్లో ఉపాధ్యాయులను కలసి ఓట్లను అభ్యర్థించారు. ఎర్రపల్లి, బండ్లపల్లి, చెన్నరాజుపల్లి గ్రామాలు, పాఠశాలల్లో మండల కన్వీనర్ జగన్మోహన్ రెడ్డి, సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు రెడ్డప్పరెడ్డి, జెడ్పీటీసీ భర్త మటన్ శంకర్, ప్రసాద్ ప్రచారం నిర్వహించారు.